## ఉమారాణి కి ఉత్తమ అవార్డ్




**పటాన్ చెరు, ఆగస్టు 27, (తెలంగాణ వాణి)**

పటాన్ చెరు మండల వనరుల కేంద్రం లో డాటా ఎంట్రీ ఆపరేటర్ గా పని చేస్తున్న ఉమారాణి కి జిల్లా తపస్ ఉపాధ్యాయ సంఘం ఉత్తమ సేవా అవార్డు అందజేశారు. బుధవారం సంగారెడ్డి లో జరిగిన గురువందనం కార్య క్రమంలో ఆమెకు ఈ అవార్డ్ అంద జేశారు. స్థానిక మండల వనరుల కేంద్రం లో ఆమె గత 15 ఏళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్ గా సేవలు అందిస్తూ పలువురి మన్ననలు పొందారు. తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ఆమెకు అవార్డ్ అంద జేశారు. ఆమెకు అవార్డ్ రావడం పట్ల కుంభ మేళా టీమ్ సభ్యులు దండు జ్యోతి, కే. వి. రవీందర్, లక్ష్మీ ప్రసన్న, బావ, శేషాద్రి తదితరులు శుభాకాంక్షలు తెలియ జేశారు.

## ఏఐ-ఆధారిత చర్మ క్యాన్సర్ నిర్ధారణపై పరిశోధనకు పీహెచ్.డీ.



**పటాన్ చెరు, ఆగస్టు 27,(తెలంగాణ వాణి):**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లోని, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని శ్రీలక్ష్మి చెరుకూరి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'డెర్మో స్కోపిక్ ఇమేజ్ విశ్లేషణను ఉపయోగించి చర్మ క్యాన్సర్ గుర్తింపు కోసం ఆప్టిమైజ్ ఎన్సెంబుల్ డీప్ లెర్నింగ్ మోడల్స్ రూపకల్పన, అభివృద్ధి'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.డి.వి. ప్రసాద్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ సిద్ధాంత వ్యాసం, చర్మ క్యాన్సర్ ను ముందుగానే గుర్తించడంలో సహాయపడటానికి కచ్చితమైన, అర్థమయ్యే, విశ్వసనీయమైన కృత్రిమ మేధస్సు–ఆధారిత ఫ్రేమ్ వర్కును అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. ఈ పరిశోధన, ఆటోమేటెడ్ చర్మ క్యాన్సర్ నిర్ధారణలో ఎదురయ్యే క్లాస్ అసమతుల్యత, మల్టీ–క్లాస్ వర్గీకరణ, మోడల్ ఆప్టిమైజేషన్, ఓవర్ ఫిట్టింగ్ వంటి అనేక కీలక సవాళ్లను పరిష్కరిస్తుందన్నారు. ఈ పరిశోధన ఇంకా, లెసియన్ సెగ్మెంటేషన్, క్లినికల్ డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ (సీడీఎస్ఎస్)ను చేర్చిన ఒక (ఎఫ్ జీ బి ఓ)–ఆప్టిమైజ్డ్ ఎన్ సెంబుల్ ఫ్రేమ్ వర్కును పరిచయం చేస్తుందన్నారు. ప్రతిపాదిత ఈ ఫ్రేమ్ వర్కు, కచ్చితమైన, నమ్మకమైన, పారదర్శకమైన రోగనిర్ధారణ మద్దతును అందించడానికి రూపొందించినట్టు తెలిపారు. ఇది చర్మ క్యాన్సర్ ను ముందుగానే గుర్తించడంలో ఆరోగ్య సంరక్షణ నిపుణులకు సహాయపడటానికి, రోగ నిర్ధారణలో ఉండే వైవిధ్యాలను తగ్గించడానికి, వైద్య విధానంలో విశ్వసనీయమైన ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించడానికి గణనీయమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు. డాక్టర్ శ్రీలక్ష్మి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఫీజుల బకాయిలపై బీజేపీ పోరు..సర్కారుకు సెగ!..

- రూ.15 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి..
- విద్యార్థుల చదువుకే నిధులు ఖర్చు చేయాలి..
- చిత్తపూర్ లో అంగలి శేఖర్ ఆధ్వర్యంలో నిరసన..



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (సిరి న్యూస్)**

రాష్ట్రంలోని విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నేన్నెల్ మండలం చిత్తపూర్ గ్రామంలో మండల అధ్యక్షుడు అంగలి శేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఫీజుల బకాయి చెల్లింపు కోసం ఆందోళన నిర్వహించారు. తెలంగాణలో విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడాల్సిన నిధులను ఇతర కార్యక్రమాలకు ఖర్చు చేయడం కంటే, పేద విద్యార్థుల చదువుకు అవసరమైన ఫీజు బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ వంటి క్రీడాకారుల కార్యక్రమాలకు రూ.100 కోట్ల ప్రజాధనం ఖర్చు చేయడం కంటే విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించడానికే ప్రాధాన్యం ఇవ్వాలని విమర్శించారు. ప్రపంచ సుందరి పోటీలకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, విద్యార్థులకు సంబంధించిన సమస్యలపై కూడా అదే స్థాయిలో దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఆహార విషబాధ ఘటనలు చోటుచేసుకుని ప్రాణనష్టం జరుగుతున్నా ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి తగిన స్థాయిలో స్పందించడం లేదని ఆరోపించారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత, ఉన్నత విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో చిత్తపూర్ ఉపసర్పంచ్ తీగుల్ల వెంకటేష్, గుండ్లపెల్లి రాజేష్, ఎండీ షఫీ, టి.సంతోష్, కె.యాదగిరి, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిపై యువగర్జన..







- డ్రగ్స్‌కు నో.. నషా ముక్త్ భారత్‌కు జై..
- 200 మీటర్ల జెండాతో దేశభక్తి ర్యాలీ..
- యువత భవిష్యత్తుకు డ్రగ్స్ పెనుముప్పు..
- మాదకద్రవ్యాలపై సమష్టి పోరాటానికి పిలుపు..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 (సిరి న్యూస్ ):**

యువతను కబళిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారికి వ్యతిరేకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సంచలనం రేగింది! ఓల్డ్ బోయిన్, హస్మత్‌పేట్ డివిజన్ మొత్తం ఒక్కసారిగా జనసంద్రంగా మారి, డ్రగ్స్‌కు నో చెప్పండి...నషా ముక్త్ భారత్‌కు యెస్ చెప్పండి అనే నినాదాలతో దద్దరిల్లింది. ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా అవగాహన ర్యాలీ యువతలో నూతన చైతన్యపు జ్వాలలను రగిల్చింది..

**200 మీటర్ల భారీ జెండాతో దేశభక్తి తరంగం..**

బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి ఉమ సారథ్యంలో ధ్యాన కేంద్రం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సాగిన ఈ భారీ ర్యాలీలో వందలాది మంది యువత, విద్యార్థులు, స్థానికులు ఉప్పొంగిపోతూ పాల్గొన్నారు. ఏకంగా 200 మీటర్ల పొడవైన మహాభారీ జాతీయ జెండాను భుజాన మోస్తూ, త్రివర్ణ పతాకంతో సాగిన ఈ ర్యాలీ యావత్తు ప్రాంతాన్ని దేశభక్తి తరంగాలతో ముంచెత్తింది. మాదకద్రవ్య రహిత భారత నిర్మాణమే లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమం అందరి మన్ననలు అందుకుంది..

**యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టేస్తున్న డ్రగ్స్..**

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ, డ్రగ్స్ అనేది యువత భవిష్యత్తును చీకటి కూపంలోకి నెట్టేసే అత్యంత ప్రమాదకరమైన సామాజిక రుగ్మత అని తీవ్రంగా హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న యువతను కాపాడుకోవడం ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు, ప్రజాప్రతినిధి, సమాజం సమష్టి బాధ్యత అని గట్టిగా నొక్కి చెప్పారు. డ్రగ్స్‌కు నో చెప్పండి...జీవితానికి యెస్ చెప్పండి! నషా ముక్త్ భారత్ అనేది కేవలం నినాదం కాదు, ప్రతి భారతీయుడి బలమైన సంకల్పం కావాలి. యువత మేల్కొంటేనే ఈ మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి సమూలంగా తరిమికొట్టగలం అని ఆయన ఉద్వేగభరితంగా పిలుపునిచ్చారు..

**అండగా నిలిచిన పోలీసు, విద్యా, రాజకీయ వర్గాలు..**

ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఈగల్ బృందం ఎస్సై శ్రీనివాస్ యాదవ్, గ్రీన్ వుడ్ హై స్కూల్ ప్రతినిధి రమేష్ రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు లలిత గౌడ్‌తో పాటు సంతోషి, దుర్గ, ఉమ, అనురాధ, రోజా, కొండమ్మ, దేవి, ఖర్జూన్, రాజకుమారి, హేమలత, అరుణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ ర్యాలీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాలపై ఒక కొత్త చైతన్య దీపాన్ని వెలిగించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు..

# మాజీ కార్పొరేటర్లతో కృష్ణారావు భేటీ..కీలక చర్చలు..

- 22ఏపై కూకట్‌పల్లిలో వేడెక్కిన రాజకీయం..
- ప్రైవేట్ ఆస్తులు 22ఏలోకి ఎలా వచ్చాయి?..
- గల్లంతైన ఓట్లపై ప్రత్యేక దృష్టి..
- ప్రజలకు అండగా ఉండాలని ఎమ్మెల్యే కృష్ణారావు ఆదేశం..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 ( సిరి న్యూస్ ):**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో 22ఏ ఆస్తుల వివాదం, ఓట్ల గల్లంతు అంశాలపై రాజకీయ వేడి పెరిగింది. ప్రజల ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చడంపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. ప్రజలు ఆందోళన చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. గురువారం కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని, గల్లంతైన ఓట్లను తిరిగి చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఓటు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసిన కృష్ణారావు..ఓటర్ల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అదే సమయంలో 22ఏ జాబితాలో ఆస్తులు చేర్చిన బాధితులకు అండగా నిలిచి, రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేసుకునేలా సహకరించాలని కోరారు. ప్రైవేట్ ఆస్తులను 22ఏలో ఎలా చేర్చారు? ప్రభుత్వ



భూములకు సంబంధించిన నిబంధనల్లో ప్రజల ఆస్తులు ఎందుకు చేరాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కృష్ణారావు ప్రశ్నించారు. ఆస్తుల విషయంలో ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించి, తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు గందరగోళంలో ఉన్నా కనీసం భరోసా కల్పించే ప్రయత్నం ప్రభుత్వం చేయకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, బాధితుల ఆస్తులను యథాస్థితికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబేహా గౌసుద్దీన్, పగడాల శిరీషా బాబు రావు, ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావుతో పాటు డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు..

# ఓటు ఒక సంఖ్య కాదు.. ప్రజల భవిష్యత్తుకు నిర్ణయాత్మక శక్తి

- 5వ వార్డులో ఓటర్ల జాబితా పరిశీలన.. తప్పుల సవరణకు చర్యలు

**నర్సంపేట, ఆగస్టు 27** : SIR ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన సవరణలు, ఓటర్లకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ పొన్నాల మనీషా ప్రకాష్, 6వ వార్డు కౌన్సిలర్ పొన్నం నర్సింహ రెడ్డి పాల్గొని ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు.

**అర్హులైన ప్రతి ఓటరుకు హక్కు దక్కేలా..**

ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా, ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. అవసరమైన చోట సవరణలు చేపట్టి జాబితాను మరింత సమగ్రంగా రూపొందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా జాబితాలో లేకుండా పోకూడదనే ఉద్దేశంతో SIR ప్రక్రియను బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పొన్నాల మనీషా ప్రకాష్, పొన్నం నర్సింహారెడ్డి లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు వరంగంటి కుమార్, ఉపాధ్యక్షులు మాసు స్వామి, ప్రధాన కార్యదర్శి శివరాత్రి నాగరాజు, యూత్ వైస్ ప్రెసిడెంట్, BLA సాయి కుమార్, BLAలు జగదీశ్, శ్రీను, సాలయ్య, BLOలు సునీత, యశోద, GPO స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధాల వేడుక రాఖీ పండుగ

- చైతన్య భారతి హై స్కూల్ లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు.
- రాఖీ ఆకృతిలో కూర్చొని, రాఖీ ప్రతిరూపాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

**మెద క్ఆగష్టు,27(సిరి న్యూస్)**



చైతన్య భారతి హై స్కూల్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రాఖీ పౌర్ణమి ప్రాముఖ్యతను చాటిచెప్పేలా వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమపద్ధతిలో మైదానంలో ప్రత్యేక ఆకృతిలో కూర్చొని రాఖీ ప్రతిరూపాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. విద్యార్థినీ, విద్యార్థుల సమన్వయంతో రూపొందించిన ఈ భారీ రాఖీ ఆకృతి చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల ఆవరణలో విద్యార్థుల సమిష్టి భాగస్వామ్యంతో రూపొందించిన ఈ దృశ్యం ఎంతో వైభవంగా కనిపించింది. రాఖీ పౌర్ణమి అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని విద్యార్థులకు తెలియజేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు, ఐక్యత మరియు సోదరభావాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.విద్యార్థుల సృజనాత్మకత, క్రమశిక్షణ, సమిష్టి కృషితో రూపొందించిన ఈ భారీ రాఖీ ఆకృతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.రాఖీ పౌర్ణమి వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల వినూత్న ఆలోచన, సృజనాత్మకతను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వారు ఆకాంక్షించారు.

# అన్న నీకు రక్షణ..

- హెల్మెట్ అన్నకు రక్షణ..
- మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు
- రద్దీ ప్రాంతాల్లో నిరంతరం నిఘా వేయనున్న షీ టీమ్స్
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, ఆగస్టు 27 (సిరి న్యూస్):**



సోదర, సోదరీమణుల మధ్య పవిత్ర ప్రేమకు, ఆప్యాయతకు, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హృదయపూర్వక రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రజలంతా ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో మహిళలు, బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందని ఎస్పీ స్పష్టం చేశారు. రద్దీ ప్రాంతాలు, ప్రధాన మార్కెట్లు, బస్టాండ్లు మరియు మహిళలు అధికంగా సంచరించే రద్దీ ప్రదేశాలలో 'షీ టీమ్స్' నిరంతరం నిఘా కొనసాగిస్తాయని వెల్లడించారు. మహిళలను లేదా బాలికలను ఎవరైనా వేధింపులకు గురిచేసినా, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే స్పందించి బాధితులు జిల్లా షీ టీమ్ నంబర్ 8712656772కు సమాచారం అందించాలని సూచించారు. అసాంఘిక శక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ ప్రయాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరిన ఎస్పీ.. 'చెల్లి కట్టే రాఖీ నీకు రక్షణ బంధం.. నువ్వు ధరించే హెల్మెట్ నీ ప్రాణానికి రక్షణ కవచం' అని పిలుపు నిచ్చారు. రాఖీ కట్టే చెల్లి కోసం మాత్రమే కాకుండా, ఇంటికోసం ఎదురుచూసే కుటుంబం కోసం ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్..

### జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా అదేశాలమేరకు

**వికారాబాద్, ఆగస్టు, 27 (సమయం న్యూస్)**



వికారాబాద్: రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్..మంచి ప్రవర్తనతో శాంతియుత జీవనం సాగించాలని సూచన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెద్దేముల్, మర్పల్లి, నవాబ్‌పేట్, బంట్వారం, దౌల్తాబాద్, కుల్కచర్ల, కోటేపల్లి మరియు తాండూర్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లను ఆయా పోలీస్ స్టేషన్లకు పిలిపించి, వారి ప్రవర్తన, గత కార్యకలాపాలను సమీక్షించారు. భవిష్యత్తులో మంచి ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా రౌడీషీటర్లు అక్రమ, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని స్పష్టంగా సూచించారు.కౌన్సెలింగ్ ద్వారా భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతమైన జీవితం గడపాలని వారికి అవగాహన కల్పించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో భాగంగా రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీస్ అధికారులు తెలిపారు.

# అనుభంధాల వేడుక రక్షా బంధన్

- మాకు మీరు రక్షా.. మీకు మేము రక్షా.
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఇంట్లో రాఖీ సంబరాలు.
- ప్రజాసేవలో అండగా నిలిచే నమ్మకానికి ప్రతీక రాఖీ బంధం..

**మెదక్ ఆగష్టు,27(సిరి న్యూస్)**



అనుబంధాల వేడుక రాఖీ పండుగ.. సోదర భావానికి ప్రతీక రక్షా బంధన్ అని మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు.ముందుగా మెదకు నియోజకవర్గ ప్రజలకు సోదరా సోదరిమనులకు, రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధికా భూపతి రాజ్ ఆధ్వర్యంలో గురువారం మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ రావు కు కౌన్సిలర్ లు దొంతి లక్షి , బుజరంపేట అరుణ,రాగి వనజ, చేదల్ సంధ్య,పల్లె రాణి, రాజ్యమణి,కొట్టాల లలిత,నస్రీన్ , అనూష తదితరులు రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కానుగు రాధిక మాట్లాడుతూ.. "రాఖీ అనేది కేవలం అన్నాచెల్లెళ్ల బంధానికి గుర్తు మాత్రమే కాదు.. ఆప్యాయత, విశ్వాసం, పరస్పర సహకారానికి ప్రతీక. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ, యువతకు అండగా నిలుస్తున్న డా. మైనంపల్లి రోహిత్ రావు కు రాఖీ కట్టడం ఎంతో సంతోషంగా ఉంది"అని అన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న డా.మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో మెదక్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేసే నాయకత్వానికి ఈ రాఖీ బంధం ఒక ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మెదక్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగా యువ నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ, అభివృద్ధి మరియు సంక్షేమానికి ప్రాధాన్య తనిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సందర్భంగా డా. మైనంపల్లి రోహిత్ రావు కుటుంబ సభ్యులకు, జిల్లా ప్రజలందరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# కదం తొక్కిన ఉద్యోగులు..





- కలెక్టరేట్ ఎదుట మహాధర్నా..
- నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్ ప్రాంగణం.
- డిమాండ్ల సాధనే లక్ష్యంగా పోరాటం.
- మహాధర్నాలో జేఏసీ చైర్మన్ దొంత నరేందర్.

**మెదక్ ఆగష్టు,27(సిరి న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం మెదక్ జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం చేపట్టిన ధర్నాలో ఉద్యోగులు కదం తొక్కారు. జిల్లా కలెక్టరేట్లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నా లో జేఏసీ చైర్మన్ దొంత నరేందర్ మాట్లాడుతూ.. పీఆర్సీ అమలు, పెండింగ్లో ఉన్న 6 డీఏల విడుదల చేయాలన్నారు.సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, హెల్త్ కార్డుల సమర్థ అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, జీవో-25 సవరణ, జీవో-190 అమలు వంటి డిమాండ్లు ఉద్యోగుల హక్కులని, ఈ హక్కులను సాధించేది సంఘటిత ఉద్యమమేనని పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం, సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమాలను కూడా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉద్యోగుల హక్కుల సాధన వరకు ఉద్యమం నిరంతరంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆవాజ్ దో హమ్ ఏక్ హై, వి వాంట్ పి అర్ సి, సిపిఎస్ అంతం జేఏసీ పంతం తదితర డిమాండ్లపై ఉద్యోగులు నినాదాలు చేశారు. అనంతరం జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడి ప్రధాన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని తదుపరి ఉద్యోగుల ఆగ్రహానికి గురై తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో యూనాస్ కు వినతిపత్రం అందజేశారు.

మహాధర్నాలో టీఎన్జీవో, టీజీవో, పిఆర్టియు టిఎస్, ఎస్ టి యు, యుటిఎఫ్, టిఆర్టిఎఫ్, టి పి టి ఎఫ్, టి టి యు, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్, పెన్షనర్స్ అసోసియేషన్ లు పాల్గొన్నాయి. జేఏసీ ప్రతినిధులు, రాజ్ కుమార్, విట్టల్, రాజగోపాల్ గౌడ్, పద్మారావు, ప్రణీత్ కుమార్, యాదగిరి, జగదీష్ చంద్ర, శ్యాంసుందర్, కొండల్ రెడ్డి, నాగభూషణం, సౌమ్య నాయక్, శివయ్య, ఇక్బాల్ పాషా, చంద్రశేఖర్, పజాలుద్దీన్, రిజ్వాన్ అలీ, హర్షద్, లీల, శివాజీ, కిరణ్ కుమార్, రాధా, విష్ణువర్ధన్ రెడ్డి, గోపాల్, శేషాచారి, ప్రభాకర్, సంతోష్, ధర్మాచందర్, ప్రశాంత్, నిఖిల్ శ్రీనివాస్, విజయ్, నరేందర్ గౌడ్, రాకేష్, శ్రీహరి, నర్సింగరావు, సంగయ్య, శ్రీనివాస్, కవిత, భూపాల్ రెడ్డి, పి డి ఆనందం, సత్యనారాయణ, సురేందర్ ప్రతాప్ లు పాల్గొన్నారు.

# కూకట్ పల్లిలో... బిఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య ఢీ!..

- 22ఏ భూములపై మాటల యుద్ధం..
- కృష్ణారావుపై యుగంధర్ రెడ్డి ఫైర్..
- మూడుసార్లు మోసం అంటూ ఘాటు విమర్శలు..
- 22ఏ భూములకు న్యాయం ఎప్పుడో మరి.?

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 ( సిరి న్యూస్ ):**








కూకట్‌పల్లి రాజకీయాల్లో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది! నిషేధిత జాబితాలో ఉన్న భూముల అంశం ఇప్పుడు రాజకీయ యుద్ధభూమిగా మారింది. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. ఏకంగా ఎమ్మెల్యే స్థాయిలో ఉండి నన్ను చంపేయండి..లేకపోతే ఉరి వేసుకుని చచ్చిపోతా అంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి నిప్పులు చెరిగారు. కూకట్‌పల్లి ప్రజలను అడ్డం పెట్టుకుని భావోద్వేగపరమైన డ్రామాలు ఆడుతున్నారంటూ నేరుగా ఎమ్మెల్యేపైనే ధ్వజమెత్తారు!.

### 22ఏ భూముల వ్యవహారంలో మలుపు..

22ఏ పరిధిలోని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్న కీలక తరుణంలోనే, ప్రభుత్వంపై, పార్టీపై బురద జల్లేందుకే కృష్ణారావు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని యుగంధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు..

### సీఎం కాళ్లు మొక్కుతా వ్యాఖ్యలపైనా అగ్గిమీద గుగ్గిలం..

ఇటీవలి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళ్లు మొక్కుతానంటూ, తన ప్రజలను ఏమీ అనొద్దంటూ కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై కూడా యుగంధర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రజలపై అంత ప్రేమ, విశ్వాసం ఉంటే అక్రమంగా కూడబెట్టిన వేల కోట్ల ఆస్తులను పేద ప్రజలకు పంచిపెట్టండి అంటూ సూటిగా సవాల్ విసిరారు!..

### మూడుసార్లు మోసం చాలు..ప్రజలకు హెచ్చరిక..

ప్రజల ముందు మొసలికన్నీరు కారుస్తూ కృష్ణారావు ఆడుతున్న రాజకీయ డ్రామాలను కూకట్‌పల్లి ప్రజలు ఇకపై నమ్మబోరని యుగంధర్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. మాయమాటలు నమ్మి ప్రజలు ఇప్పటికే మూడుసార్లు మోసపోయారని ఎద్దేవా చేశారు. కృష్ణారావును కాంగ్రెస్ పార్టీలో చేరాలని తమ పార్టీ ఎన్నడూ కోరలేదని, కనీసం ఆహ్వానం కూడా పలకలేదని కుండబద్దలు కొట్టారు. భావోద్వేగపూరిత వ్యాఖ్యలతో ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని, వాస్తవాలను గమనించి వ్యవహరించాలని కూకట్‌పల్లి ప్రజలకు యుగంధర్ రెడ్డి పిలుపునిచ్చారు. మొత్తానికి ఈ వ్యవహారం రాబోయే రోజుల్లో మరింత రాజకీయ వేడి పుట్టించే అవకాశం కనిపిస్తోంది!..

### ఈ దుమారంతో ఉపయోగం ఏమిటి..నష్టం ఏమిటి?..

కూకట్‌పల్లిలో రేగిన ఈ రాజకీయ దుమారం వల్ల ఒకవైపు 22ఏ భూముల సమస్యపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే మరోవైపు, నాయకుల మధ్య మాటల యుద్ధం వల్ల అసలు సమస్య అయిన భూముల నిషేధిత జాబితా తొలగింపు అంశం పక్కదారి పట్టే ప్రమాదం కూడా లేకపోలేదు. ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య అసలైన లబ్ధిదారులైన సామాన్య ప్రజలకు ఎంతవరకు న్యాయం జరుగుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది..

### 22ఏ భూముల వ్యవహారంలో ప్రజలకు న్యాయం జరుగుతుందా?..

ప్రభుత్వం ఇప్పటికే 22ఏ పరిధిలోని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే దిశగా చర్యలు చేపడుతున్నట్టు ప్రకటించినప్పటికీ, ఆచరణలో ఈ ప్రక్రియ ఎంత వేగంగా, పారదర్శకంగా జరుగుతుందనేదానిపైనే ప్రజల భవిష్యత్తు ఆధారపడి ఉంది. రాజకీయ నాయకుల మధ్య నెలకొన్న విమర్శల పర్వం మధ్య, ఈ హామీలు వాస్తవ రూపం దాలుస్తాయా లేక కేవలం ఎన్నికల ప్రయోజనాలకే పరిమితమవుతాయా అనేది కాలమే తేల్చాల్సి ఉంది.

ఇవన్నీ ఈ రాజకీయ దుమారం వ్యవహారానికి సంబంధించి మరిన్ని కథనాలు సిరి తెలుగు దినపత్రిక సంచికలో వెలుగులోకి రానున్నాయి. ఏది ఏమైనా, సిరి తెలుగు దినపత్రిక ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి, వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తుంది..

